ఐఎస్ఐ మార్కు హెల్మెట్లనే వాడాలి

పార్వతీపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఐఎస్ఐ మార్కు ఉన్న హెల్మెట్లనే ద్విచక్రవాహనదారులు వినియోగించాలని జిల్లా రవాణాశాఖాధికారి టీ.దుర్గాప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆపద సమయాల్లో అవి ప్రాణాలకు రక్షణగా నిలుస్తాయన్నారు. ఐఎస్ఐ మార్కు లేని హెల్మెట్లు అమ్మినా, కొన్నా చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించకుంటే వాటిని విక్రయించే షోరూమ్‌లను సీజ్ చేస్తామన్నారు. ఐఎస్ఐ మార్కు లేకపోయినా, హెల్మెట్ లేకుండా బైక్ నడిపినా అపరాధ రుసుం విధించడంతో పాటు వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఖాళీగా ఉందా.. కబ్జానే!

- ప్రభుత్వ స్థలాలు.. సాగునీటి కాలువలు అన్యాక్రాంతం
- విలువైన భూములు, చెరువుల్లో అక్రమ నిర్మాణాలు
- పాలకొండలో రెచ్చిపోతున్న ఆక్రమణదారులు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



ఆక్రమణలకు గురైన బంగారమ్మ కోనేరు

పాలకొండ, జూలై 29(ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రమైన పాలకొండ కబ్జా కోరల్లో చిక్కుకుంది. పట్టణంలోని ఆక్రమణలకు అంతే లేకుండాపోతుంది. ఖాళీ స్థలాలు, భూములు, కాలువలు, చెరువులు, ఇతర ప్రభుత్వ ఆస్తులు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నాయి. అక్రమ నిర్మాణాలతో మరోవైపు సాగునీటి కాలువలు కూడా కుచించుకుపోతున్నాయి. దీంతో శివారు ప్రాంత భూములకు నీరందడం లేదు. అధికార యంత్రాంగం చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. కాదేదీ కబ్జాకు అనర్హం అన్నట్టుగా సాగుతూ.. రెండు చేతులా సంపాదిస్తున్నారు. మొత్తంగా వారి దందా మూడు పూలు.. ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాల ఆవిర్భావం తర్వాత పాలకొండలో భూముల ధరలు అమాంతం పెరిగాయి. దీంతో కబ్జాదారుల కళ్లు విలువైన ప్రభుత్వ ఆస్తులపై పడ్డాయి. పట్టణంలో ఇష్టానుసారంగా కబ్జాలకు పాల్పడుతున్నారు. అయితే దీనిపై అధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నా చర్యలు శూన్యం. పట్టణంలో ఆక్రమణలు ఇలా..

- పట్టణంలోని వెంకంపేట, నాగవంశపువీధి, తమ్మినాయుడు విద్యా సంస్థల సమీపంలో ఉన్న డీసీఎంఎస్ స్థలాలను కొంతమంది ఆక్రమించు కున్నారు.
- స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఆనుకుని ఉన్న 25 సెంట్లకు సంబంధించి లీజు పట్టా పొందిన ఓ వ్యక్తి దానిని విక్రయించగా ఆ స్థలం చేతులు మారుతుంది. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ యంత్రాంగం ప్రభుత్వ స్థలమని అక్కడ బోర్డులు పెట్టింది. అయితే ఇటీవల కొంతమంది వ్యక్తులు ఆ స్థలాన్ని చదును చేసి పిల్లర్స్ వేశారు. దీంతో మరోసారి దళిత సంఘ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో కబ్జాకు గురవుతున్న స్థలం

- గారమ్మకాలనీలో సామాజిక భవన నిర్మాణానికి కేటాయించిన 25 సెంట్లపై కొందరి కన్ను పడింది. వైసీపీ సర్కారు హయాంలో కొందరు నకిలీ పట్టాలు సృష్టించారు. వీటిపై ఉన్నతధికారులకు ఫిర్యాదు అందకపోవడంతో ఇప్పటివరకు మిన్నకున్న కబ్జాదారులు మళ్లీ ఆ భూమిని వాటిని సొంతం చేసుకోవడానికి పావులు కదుపుతున్నట్టు తెలిసింది.
- గతంలో సుమారు ఎకరా విస్తీర్ణంలో ఉండే పట్టణంలోని పీతలవానిబంద నేడు పది సెంట్లు కూడా లేకుండా పోయింది. వెంకటరాయుని కోనేరు గట్టుకు నలువైపులా ఆక్రమణదారులు పశువుల పాక వేశారు. తెలకలవానికోనేరు సమీపంలోని సుమారు రెండు ఎకరాలు ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి వేరే వారికి లీజుకు ఇచ్చినట్టు తెలుస్తోంది. రెండు ఎకరాల్లో ఉన్న బంగారమ్మ కోనేరు ఇప్పటికీ సగం వరకు ఆక్రమణలకు గురైంది. గొడగల వీధిలో ఉన్న సుమారు 70 సెంట్ల స్థలంలో కొంతమంది వ్యక్తులు దురా క్రమణ చేసి గ్రావెల్ వేశారు. దీనిపై రెవెన్యూ వారికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది.

సాగునీటి కాలువలు ఇలా..

- సీఎల్ నాయుడు నగర్ నుంచి వడమ వరకు పూర్తిగా తోటపల్లి ప్రధాన కాలువ ఆక్రమణలకు గురైంది. కాలువకు ఇరువైపులా అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో శివారు ప్రాంత భూములకు సాగునీరు

(మిగతా 8వ పేజీలో...)

భూసేకరణ కోసం రూ.550 కోట్లు

- బాడంగి విమానాశ్రయ విస్తరణకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- మూడోవిడత భూ రీసర్వే ప్రారంభం

బొబ్బిలి, జూలై 29(ఆంధ్రజ్యోతి): బ్రిటీష హయాంలో నిర్మించిన బాడంగి విమానాశ్రయాన్ని విస్తరించి వినియోగంలోనికి తేవాలని నేవీ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇందుకు అవసరమైన భూ సేకరణకు ప్రతిపాదలను రెవెన్యూ అధికారులు కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. కొత్తగా 1,570 ఎకరాలను రైతుల నుంచి సేకరించేందుకు రూ.550 కోట్లు అవసరం ఉంటుందని అందులో పేర్కొన్నారు. బొబ్బిలి ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు మంగళవారం ఈ వివరాలు వెల్లడించారు.

- ప్రస్తుతం నేవీ ఆధీనంలో 180 ఎకరాలు ఉంది. నూతనంగా ఏర్పాటు చేయదలుచుకున్న ఆయుధ డిపోకోసం మొత్తం 1,796 ఎకరాలు అవ సరం ఉంటుంది. ప్రభుత్వ భూములు, డి.పట్టా భూములను మినహా యించుకుని ఇంకా 1,570 ఎకరాలను సేకరించాల్సి ఉంటుంది. ముగడ, పాల్తేరు, కోడూరు, రామచంద్రపురం, మల్లమ్మపేట, పూడివలస తదితర గ్రామాల రైతుల నుంచి సేకరించేందుకు ప్రతిపాదించారు. రానున్న కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయిస్తే భూసేకరణ ప్రక్రియ ప్రారంభిస్తారు.



మాట్లాడుతున్న బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు

16 గ్రామాల్లో మూడోవిడత

బొబ్బిలి రెవెన్యూ డివిజన్ పరిధిలో 16 గ్రామాల్లో మూడో విడత భూ రీసర్వే ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్టు ఆర్డీవో వెల్లడించారు. డిసెంబరు లోగా ఈ పనులను పూర్తి చేస్తామన్నారు. 1, 2 విడతలలో 17 గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తయ్యాయని తెలిపారు. రామభద్రపురం మండలం కాకర్లవలస, కారేడువలస గిరిజన గ్రామాలలో ఏపీఐఐసీకి చెందిన ఎంఎస్ఎంఈ పార్కు భూములు తమవంటూ గిరిజనులు చెబుతున్నారని, వాటి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. రైతుల జిరాయితీ భూములు 22ఏ జాబి తాలో చేరినపక్షంలో మ్యూటేషన్ కోసం దరఖాస్తు చేసుకుంటే కలెక్టరు, జాయింట్ కలెక్టరు పరిశీలించి పరిష్కరిస్తారని చెప్పారు. మాజీ సైనికుల భూములు పదేళ్లు దాటితే పూర్తి హక్కులు వారికి దఖలు పడతాయని చెప్పారు. 2019 అక్టోబరుకు ముందు ఆక్రమిత స్థలాలు 150 చదరపు గజాలలోపు అయితే ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామన్నారు. 150 చదరపు గజాల పైబడ్డ స్థలాలకు నిర్ణీత రుసుం వసూలు చేస్తామని తెలి పారు. జీవో 23 ప్రకారం గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల ఇంటి స్థలాల పంపిణీకి సంబంధించి కసరత్తు ప్రారంభించినట్లు వివరించారు.

జూలైలోనూ కలవరమే..

- జిల్లాలో విచిత్ర వాతావరణం
- ముఖం చాటేసిన వరుణుడు
- మళ్లీ పెరిగిన ఎండ వేడి
- అడపాదడపా వర్షాలు కురుస్తున్నా.. తప్పని ఉక్కపోత
- ఆందోళనలో ప్రజలు, రైతులు

పార్వతీపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విచిత్ర వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. గత కొద్ది రోజుల కిందట ఎండలు ఠారెత్తించాయి. ఆ తర్వాత అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో ప్రజలు, రైతులు ఊపిరిపీల్చుకున్నారు. వాతావరణం చల్లబడగా.. మరోవైపు పంట పొలాల్లోకి నీరు చేరింది. సాగునీటి వనరులు, ప్రధాన ప్రాజెక్టులు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో ఎంతో ఆనందంతో రైతులు ఖరీఫ్ పనులు ప్రారంభించారు. కాగా రెండు రోజుల నుంచి మళ్లీ వాతావరణం మారింది.



ఆకాశం మేఘావృతమై ఉన్నా.. వేడి, దానికి తోడు ఉక్కపోత అధికంగా ఉండడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇదే సమయంలో సీజనల్ వ్యాధులు, జ్వరాలు ప్రబలుతుండడంతో జిల్లావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మళ్లీ వర్షాలు ముఖం చాటేయడంతో ఖరీఫ్ రైతులు ఆందోళన చెందుతున్నారు. మొత్తంగా వాతావరణ మార్పులు మన్యం వాసులను కలవరపరుస్తున్నాయి.



అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ ఇల్లు

- ఎస్ఎస్ఎల్ఆర్ ఏడీ గోవిందరావు

పార్వతీపురం, జూలై29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ రానున్న రెండేళ్లలో ఇల్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సర్వే, భూ నమోదు విభాగం అదనపు సంచాలకులు ఆర్.గోవిందరావు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...' పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల స్థలాన్ని కేటాయించాలి. 2019 కన్నా ముందే అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల్లో గృహాలు నిర్మించుకున్న వారికి రెగ్యులరైజేషన్ పూర్తి చేయాలి. ఈ ప్రక్రియను ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలి. ఎస్సీ హేబిటేషన్లలో శ్మశాన వాటికలకు వెళ్లేందుకు వీలుగా ఉపాధి హామీ పథకం నిధులతో రహదారులు నిర్మించాలి. ఆక్రమణకు గురైన శ్మశాన వాటికల స్థలాలను గుర్తించి ప్రభుత్వ భూమిని తిరిగిపొందాలి. పీజీఆర్ఎస్‌లో ఎండార్స్‌మెంట్ పక్కాగా ఉండాలి. అర్జీల పరిష్కారానికి

(మిగతా 8వ పేజీలో...)



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ గోవిందరావు

జ్వరాలపై మరింత అప్రమత్తం

- పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యసేవలందించండి
- డీఎంహెచ్‌వో భాస్కరరావు ఆదేశం

సీతంపేట రూరల్, జూలై29 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో జ్వరాలపై వైద్యసిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు ఆదేశించారు. మంగళవారం దోనుబాయి పీహెచ్‌సీని సందర్శించారు. అక్కడ ఓపీ, మలేరియా, విషజ్వరాల తీవ్రతపై ఆరా తీశారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలో జ్వరపీడితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అదనపు వైద్యాధికారి శివకుమార్‌ను ఆదేశించారు. అనంతరం సీతంపేట ఏరియా ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సీజన్‌లో రోజువారీ ఆసుపత్రికి వచ్చే జ్వరపీడితుల సంఖ్యను సూపరింటెండెంట్ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. జ్వరాలతో చికిత్సపొందుతున్న రోగులతో మాట్లాడారు. రక్తనమూనాలు సేకరించే గది, అక్కడి రికార్డులను పరిశీలించారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మళ్లీ సీతంపేటలో గజరాజులు 6లో

దివ్యాంగులకు ప్రభుత్వాల అండ 6లో
- ప్రభుత్వ విప్ జగదీశ్వరి



ఇన్‌స్పైర్ మనక్ అవార్డు నామినేషన్ల పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రవేశాలు పెరగాలి: కలెక్టర్

పార్వతీపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రవేశాలు తక్కువగా ఉన్నాయి. ఇంకా గడువు ఉన్నందున విద్యార్థులు చేరేలా ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి. ఈ నెలాఖరు నాటికి 1, 6, 11 తరగతుల్లో ప్రవేశాలు పెరగాలి. జీఎల్‌పురం, సాలూరు, పార్వతీపురం, పాలకొండ, సీతంపేట ఎంఈవోలు దీనిపై దృష్టి సారించాలి. ఒక్క విద్యార్థి కూడా బయట ఉండరాదు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులను తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులు చేరేలా చొరవ తీసుకోవాలి. పాఠశాలలు సమయపాలన పాటించాలి. సెలవుపై ఉపాధ్యాయులు వెళ్తే.. తాత్కాలికంగా సర్దుబాటు చేసుకోవాలి. ప్రతి పాఠశాల, కళాశాలలో విద్యుత్, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కచ్చితంగా ఉండాలి. ఉత్తీర్ణత శాతం పెంచాలి. ఆధార్ సమస్యలున్న చోట్ల పరిష్కరించి విద్యార్థులను చేర్పించాలి.' అని తెలిపారు. అనంతరం 'ఇన్‌స్పైర్ మనక్ అవార్డు నామినేషన్లు-2025' పోస్టర్‌ను విడుదల చేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. 6-12 తరగతుల విద్యార్థుల నుంచి ఐదు వినూత్న ఆలోచ నలను సెప్టెంబరు లోగా ఇన్‌స్పైర్ మనక్ స్కీమ్ వెబ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.

ఉపాధిపై ఆశతో..
- మాయగాళ్లకు చిక్కుతున్న యువతీ యువకులు
- నేడు ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం

6లో

పండుగ ఖర్చులకు ఆమోదం తెలపరా? 8లో
- మంత్రి సంధ్యారాణి

పసుపు కొమ్ములతో శ్యామలాంబకు అలంకరణ 6లో

ఆశ్రమ పాఠశాల విద్యార్థికి పాముకాటు 8లో

ఏటా ఆలస్యమే..!

- గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్ సీట్లు పెంపు
- ఇంకా భర్తీ కాని వైనం..
- నేటితో తీరనున్న గడువు
- విద్యార్థుల కోసం అన్వేషణ

సీతంపేట రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల కళాశాలల్లో ఏటా ఆలస్యంగా సీట్లు పెంచడంతో విద్యార్థుల చదువులు ముందుకు సాగడం లేదు. వాస్తవంగా ఐటీడీఏ పరిధిలో ఇంటర్ విద్యకు అధిక డిమాండ్ ఉంది. కానీ పరిమిత సీట్లు ఉండడంతో మెరిట్ ఆధారంగా ప్రవేశాలు అవకాశం కల్పిస్తున్నారు. వాటి భర్తీ తరువాత ఆలస్యంగా సీట్లు పెంచుతుండడం వల్ల గిరిజన విద్యార్థులకు ఎటువంటి ఉపయోగం ఉండడం లేదు. అప్పటికే ప్రైవేట్ కళాశాలల్లో చేరిన వారు అక్కడ చదవలేక.. తిరిగి ఇక్కడకు రాలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన వారం రోజుల కిందట సీతంపేట బాలికల గురుకుల కళాశాలలో 30 వరకు అదనంగా ఇంటర్‌మీడియట్ సీట్లు పెంచారు. బైపీసీ 10, ఎంపీసీ 10, హెచ్ఈసీ గ్రూపులో 10 సీట్లను పెంచారు. అయితే కళాశాలలో చేరేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పెంచిన సీట్లు 50 శాతానికి పైగా ఖాళీలు ఉన్నాయి. దీంతో మిగుల సీట్ల కోసం కళాశాల యాజమాన్యం విద్యార్థుల కోసం అన్వేషిస్తున్నారు. గతంలో కౌన్సిలింగ్‌కు హాజరైన విద్యార్థులను ఫోన్‌ల ద్వారా సంప్రదిస్తున్నారు.



సీతంపేటలోని ఏపీఆర్ బాలికల కళాశాల

ఇదీ పరిస్థితి..

ఐటీడీఏ పరిధిలో సీతంపేట బాలురు, బాలికలు, పెద్దమడి, మల్లి కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ)తో కలిసి నాలుగు కళాశాలలున్నాయి. వాటి పరిధిలో సుమారు 480 మంది చదువుతున్నారు. అయితే ఏటా గురుకుల కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాలకు అధిక డిమాండ్ ఉన్నా.. ఆ స్థాయిలో సీట్లు పెంచడం లేదు. దీంతో కౌన్సిలింగ్‌కు రావడం.. సీటు రాక నిరాశతో విద్యార్థులు వెనుదిరగడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. ఆర్థిక భారమైనా కొందరు మైదాన ప్రాంతాల్లోని ప్రైవేట్ కళాశాలల్లో చేరుతున్నారు. మరి కొందరు చదువుపై ఆసక్తి ఉన్నా.. స్థోమత లేక డ్రాపౌట్లుగా మారుతున్నారు. ఏటా అనుకున్న గ్రూప్‌ల్లో సీట్లు లభించక

(మిగతా 8వ పేజీలో...)

ఆ 46 ఇళ్లకు రీసర్వే

- గృహాల విస్తీర్ణం నమోదు, పన్నుల్లో తేడా
- క్షేత్రస్థాయి సిబ్బంది నిర్వాకంతో తిప్పలు

భామిని, జూలై 29 (ఆంధ్రజ్యోతి): భామిని మండలంలోని 46 ఇళ్ల విస్తీర్ణం నమోదు, పన్నుల్లో తేడా కనిపించడంతో అధికారులు రీ సర్వేకు ఉపక్రమించారు. ఈ మేరకు మంగళవారం డీపీవో కొండలరావు ఆధ్వర్యంలో కొరమలో 36 ఇళ్ల కొల తలు తీసుకున్నారు. పొడవు, వెడల్పులను కొలిచి.. వాటి వాస్తవ విస్తీర్ణాన్ని నమోదు చేశారు. ఏడాది కిందట సచివాలయం సిబ్బంది మండలంలో 11,287 ఇళ్లను సర్వే చేశారు. అయితే కొన్ని ఇళ్ల పొడవు, వెడల్పులను

(మిగతా 8వ పేజీలో...)



కొరమలో ఇళ్ల కొలతలు తీస్తున్న అధికారులు

ఉపాధిపై ఆశతో..

- మాయగాళ్లకు చిక్కుతున్న యువతీ యువకులు
- ఉద్యోగాల పేరుతో మానవ అక్రమ రవాణా
- నిఘా మరింత పెంచితేనే ఫలితం
- నేడు ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం



పేదరికం... నిరుద్యోగం జనానికి శాపం. అవే కొందరికి వరం. పేదరికంతో బాధ పడుతున్న వారు... నిరుద్యోగ సమస్యతో కుంగిపోతున్న వారే వారికి ఆధారం. ఉద్యోగాలు... ఉపాధిని ఎరజూపి రాష్ట్రాలు.. దేశాలను దాటిస్తున్నారు. మోసపు మాటలతో... మాయచేసి మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. విదేశాలకు తరలించి... చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో భాగస్వాములను చేస్తున్నారు. ఈ మాయగాళ్ల వలలో చిక్కుకుంటున్న యువతీ యువకులు... మహిళల పరిస్థితి అత్యంత దారుణంగా ఉంటోంది.


విజయనగరం క్రైం, జూలై 29(ఆంధ్రజ్యోతి): వ్యక్తుల కుటుంబ సమస్యలను ... పేదరికాన్ని ఆసరాగా తీసుకుని కొంతమంది మోసపూరిత మార్గాల్లో బలవంతంగా మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. దీన్ని నిరోధించేందుకు ప్రభుత్వాలు చేస్తున్న కృషి పూర్తి స్థాయిలో ఫలితాలను ఇవ్వడం లేదనే చెప్పుకోవాలి. లైంగికంగా దోపిడీ చేయడానికి స్త్రీలు, పురుషులు, పిల్లలను అక్రమంగా రవాణా చేస్తుంటారు. కొన్ని దేశాల్లో తక్కువ వేతనాలతో కార్మికులుగా పనులు చేయించుకోవడానికి కూడా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఇతర దేశాల్లో భారీ ఎత్తున జీతాలు ఇప్పిస్తామంటూ కొంతమంది ముఠాగా ఏర్పడి మాయమాటలతో తరలిస్తున్నారు. అక్కడికి వెళ్లిన తరువాత వీరిని బానిసలుగా వినియోగిస్తూ వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. యువతులు, మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారు. అక్కడికి వెళ్లిన వారు నానా యాతన పడుతూ తినడానికి తిండి కూడా లేకుండా ఇబ్బందికర పరిస్థితులను గడుపుతున్న సంఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటువంటి వాటిపై పటిష్ఠమైన నిఘా ఏర్పాటు చేశాయి. ఈ అక్రమ రవాణాను అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. మానవ అక్రమ రవాణాను నిరోధించడానికి మన చట్టాలకు పదును పెడుతున్నారు. అయినా ఎక్కడో ఓ చోట ఇలాంటి సంఘటనలు వెలుగు చూస్తున్నాయి.

థాయ్‌లాండ్‌లో ఉద్యోగం పేరుతో...

తాజాగా సుమారు నాలుగు నెలల కిందట విజయనగరానికి చెందిన ఇద్దరు యువకులు ఇన్‌స్టాగ్రామ్‌లో కనిపించిన జాబ్ నోటిఫికేషన్‌కు స్పందించి దరఖాస్తు చేశారు. థాయ్‌లాండ్ రావాలని... జీతం నెలకు రూ.లక్ష వస్తుందని నమ్మబలికారు. దీంతో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు యువకులు థాయ్‌లాండ్ వెళ్లారు. అక్కడ సంబంధిత వ్యక్తులు వీరిని మోసం చేసి ...ఉద్యోగం కోసం కాకుండా మయన్మార్‌కు తరలించారు. అక్కడ మాదక ద్రవ్యాలు సేవించడం అలవాటు చేయడం... వారికి బానిసలుగా చూడడం... సైబర్ నేరాలు చేయాలని ప్రేరేపించడం వంటి పనులు అప్పగించారు. దీంతో ఆ ఇద్దరు యువకులు మయన్మార్‌లోని ముష్కరుల చెరలో ఉండిపోయారు. తల్లిదండ్రులు ఇక్కడ బిడ్డల రాకకోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ సాయం కోరుతున్నారు.



ప్రత్యేక నిఘా: ఎస్పీ



మానవ అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. మహిళల పేదరికాన్ని చూసి మాయమాటలతో అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ప్రత్యేక నిఘా పెట్టామని చెప్పారు.



పసుపు కొమ్ములతో దర్శనమిస్తున్న శ్యామలాంబ

పసుపు కొమ్ములతో శ్యామలాంబకు అలంకరణ

సాలూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తోటవీధిలో ఉన్న శ్రీశ్యామలాంబ అమ్మవారిని భక్తులు మంగళవారం పసుపు కొమ్ములతో అలంకరించారు. కోర్కెలు తీర్చే కల్పవల్లి, సాలూరు ప్రజల ఆరాధ్యదేవతగా పేరొందిన శ్యామలాంబను సాలూరు పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కొత్తవలస రైల్వేస్టేషన్



- అమృత్ భారత్‌తో మారనున్న రూపురేఖలు
- త్వరలో విశాఖ వెళ్లని రైళ్లకు హాల్ట్

కొత్తవలస, జూలై 29(ఆంధ్రజ్యోతి): సుమారు 80 సంవత్సరాల చరిత్ర కలిగిన కొత్తవలస రైల్వేస్టేషన్ కొత్త హంగులు సమకూర్చుకుంటోంది. కొత్తవలస-కిరండోల్ లైన్ ఏర్పాటు చేసే నాటికే ఈ స్టేషన్ ఉంది. అందుకే ఈ లైన్‌ను కే కే లైన్ అని పిలుస్తుంటారు. జపాన్‌తో కుదిరిన ఒప్పంద ప్రకారం ఆ దేశానికి ఐరన్ ఓర్ ఇవ్వడానికి కిరండోల్ వరకు రైల్వేలైన్ ఏర్పాటు చేశారు. ఆ ఒప్పందం ప్రకారమే కొద్ది సంవత్సరాల కిందటి వరకు జపాన్‌కు ఐరన్ ఓర్ ఎగుమతి అయ్యింది. గతంలో కొత్తవలస రైల్వే స్టేషన్ మామిడితో సహా వివిధ ఉత్పత్తులను ఇతర రాష్ట్రాలకు రవాణా చేసేందుకు కేంద్ర బిందువుగా ఉండేది. కాలక్రమేణా రోడ్డు రవాణా అభివృద్ధి చెందడంతో ఈ స్టేషన్ నుంచి ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి.

అమృత్ భారత్‌తో...

కేంద్ర ప్రభుత్వం దేశంలోని వివిధ రైల్వేస్టేషన్లను అమృత భారత్‌కింద అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసిందే. వీటిలో కొత్తవలస రైల్వేస్టేషన్ ఉంది. ఇందులో భాగంగా దీని అభివృద్ధికి సుమారు రూ.19 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పనులు శరవేగంగా చేస్తున్నారు. రానున్న రోజులలో కొత్తవలస రైల్వేస్టేషన్ అతి పెద్దదిగా అవతరించే అవకాశాలు కనిసిస్తున్నాయి. ఈ రైల్వేస్టేషన్ విజయనగరం జిల్లా కేంద్రానికి సుమారు 38 కిలోమీటర్ల దూరంలో... విశాఖ నగరానికి అతి సమీపంలో ఉంది. విజయనగరం తరువాత అతి పెద్ద రైల్వేస్టేషన్ కూడా ఇదే కావడం విశేషం. అనేక రైళ్లు దీని మీదుగా ఇటు విశాఖపట్నం, అటు కోల్‌కతా వైపు వెళుతుంటాయి. విశాఖపట్టణం రైల్వేస్టేషన్‌కు వెళ్లని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కొత్తవలసలో హాల్ట్ కనిపించాలనే యోచన ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం విశాఖపట్నం వెళ్లని ఎక్స్‌ప్రెస్ రైళ్లు విజయనగరం నుంచి కొత్తవలస, దువ్వాడ స్టేషన్ల మీదుగా అనకాపల్లి, రాజమండ్రి వెళుతున్నాయి. విశాఖకు దువ్వాడ చాలా దూరంగా ఉండడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అదే కొత్తవలస రైల్వేస్టేషన్‌లో హాల్ట్ కల్పిస్తే విశాఖ వాసులకు ఉపయుక్తంగా ఉంటుందని భావిస్తున్నారు.



విశాఖలో విలీనమవుతుందా?

జిల్లాల పునర్విభజన జరిగితే కొత్తవలస మండలం విశాఖలో విలీనమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అలా జరిగితే విశాఖకు రెండో రైల్వేస్టేషన్‌గా ఆవిర్భవించనుంది. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శృంగవరపుకోట నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలో విలీనం చేస్తానని హామీ ఇచ్చారు. దీని ప్రకారం 100 శాతం విలీనం అవుతుందని స్థానికులు భావిస్తున్నారు. ఇప్పటికే కొత్తవలస విశాఖపార్లమెంటరీ నియోజకవర్గంలో ఉంది.

అత్యాధునిక సదుపాయాలు..

కొత్తవలస రైల్వే స్టేషన్ ఇప్పటికే సువిశాలంగా ఉంది. ఇప్పుడు ఈ స్టేషన్‌ను అత్యాధునిక మార్పులు చేస్తున్నారు. ప్రస్తుత ప్లాట్‌ఫారాలను విస్తరించడం... కొత్తగా ప్లాట్‌ఫారాలను నిర్మించడం... సువిశాలంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఎస్కలేటర్‌లను నిర్మిస్తున్నారు. ప్రయాణికులు కూర్చునేందుకు అవసరమైన కర్సీలు, బెంచీలతో పాటు విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. ఇవి త్వరలో అందుబాటులోకి వస్తాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

ఇవీ సమస్యలు..

ప్రస్తుతం ఈ రైల్వేస్టేషన్‌లో ప్రధానంగా మరుగుదొడ్ల సమస్య ఉంది. ఒకటో నెంబర్ ప్లాట్ ఫారంపైకి సాధారణ రైళ్లు రాకుండా... గూడ్స్ రైళ్లను ఉంచడం వల్ల వృద్ధులు, మహిళలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని రైల్వేశాఖ అధికారులను ప్రశ్నించగా సాంకేతికపరమైన సమస్య ఉందని తెలిపారు. ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారంపైకి రావాలంటే కొద్ది దూరంలోని లూప్‌లైన్‌ల నుంచి మళ్లించాల్సి ఉంటుందన్నారు. ఒకటో ప్లాట్‌పారం నుంచి మెయిన్ లైన్‌లోకి వెళ్లాలంటే సుమారు 15 నిమిషాలు ఆలస్యం అవుతుందని అంటున్నారు. దీని వల్ల రైళ్లు ఆలస్యమయ్యే అవకాశం ఉందని తెలిపారు. రెండు మూడు ప్లాట్‌ఫారాలకు అటువంటి సమస్య లేదని... నేరుగా రైళ్ల రాకపోకలు సాగుతున్నాయన్నారు. త్వరలోనే ఈ సమస్యలన్నీ సమసి పోతాయని రైల్వేశాఖ అధికారులు తెలిపారు.



పూజల్లో పాల్గొన్న మహిళలు

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

సాలూరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా సాలూరు కామాక్షీదేవి దేవాలయంలో మంగళవారం శారదా సత్సంఘ వ్యవస్థాపక గురువు ముద్దు సత్యనారాయణ ఆధ్వర్యంలో మహిళలు సామూహికంగా మంగళగౌరీ వ్రతాన్ని, కుంకుమ పూజలను చేశారు. శ్రావణ మాసంలో మంగళగౌరీ పూజ చేస్తే శుభ ఫలితాలను ఇస్తుందని భక్తుల నమ్మకం. ఈ మేరకు పెద్దసంఖ్యలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. కామాక్షి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

పైడిమాంబకు శ్రావణమాస పూజలు

విజయనగరం కల్చరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు పైడిమాంబకు మంగళవారం శ్రావణమాస పూజలు నిర్వహించారు. దేవదాయ శాఖ ఏసీ, ఆలయ ఇన్‌చార్జి ఈవో శిరీష ఆధ్వర్యంలో పైడిమాంబను ప్రత్యేక పూలతో అలంకరించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి విశిష్ట పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. నేవేద్యంగా బూర్లెను సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రావణ మాసం కావడంతో పైడిమాంబ ఆలయానికి భక్తుల తాకిడి రోజురోజుకీ పెరుగుతోంది. దీంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



పైడిమాంబకు ప్రత్యేకాలంకరణ



అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

నేడు ఏఎంసీ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ

విజయనగరం రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) పాలకవర్గం బాధ్యతల స్వీకరణ కార్యక్రమం మార్కెట్ కమిటీ ఆవరణలో బుధవారం ఉదయం 11.02 గంటలకు జరు గనుంది. ఈ మేరకు వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. చైర్మన్ చాంబర్‌తో పాటు, పాలకవర్గ సభ్యుల సమావేశానికి ప్రత్యేక గదిని సిద్ధం చేశారు. నగరం, మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి 13 మంది డైరెక్టర్లు వారి, వారి ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు. గాజులరేగ ప్రాంతం నుంచి చైర్మన్ కర్రోతు నర్సింగరావు తన అనుచరులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి రానున్నారు. వైస్ చైర్మన్ చంద్రినాయుడు కూడా జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులతో కలిసి మార్కెట్ కమిటీకి తరలిరానున్నారు. టీడీపీ నగర, మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని నిర్వాహకులు చెబుతున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్. చిత్రంలో విప్ జగదీశ్వరి, ఎమ్మెల్యే విజయచంద్ర

దివ్యాంగులకు ప్రభుత్వాల అండ

- విప్ జగదీశ్వరి

బెలగాం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉన్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ప్రభుత్వాల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ముందుకెళ్లాలని సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ కళాశాల మైదానంలో సీఆర్సీ (కాంపోజిట్ రీజినల్ సెంటర్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్, రిహాబిలిటేషన్ అండ్ ఎంపవర్‌మెంట్), నెల్లూరు జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో పర్పుల్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు. సీఆర్సీ డైరెక్టర్ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కలెక్టర్ శ్యాంప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ దివ్యాంగుల కలలను సాకారం చేసుకునేందుకు ఇదో చక్కని అవకాశం అని చెప్పారు. కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ దివ్యాంగులకు సహకారం అందించేందుకు పర్పుల్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ కళాశాల మైదానంలో సీఆర్సీ (కాంపోజిట్ రీజినల్ సెంటర్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్, రిహాబిలిటేషన్ అండ్ ఎంపవర్‌మెంట్), నెల్లూరు జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో పర్పుల్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు. సీఆర్సీ డైరెక్టర్ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కలెక్టర్ శ్యాంప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు వారి ప్రతిభతో చక్కని వస్తువులు తయారు చేశారని చెప్పారు. ఆరోగ్యపరంగా సమస్యలు ఉంటే ఎర్లీ ఇంటర్వెన్షన్స్ సెంటర్ కూడా అందుబాటులో ఉందని తెలిపారు. భవిత సెంటర్ ద్వారా దివ్యాంగులకు అవసరమైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం దివ్యాంగులకు ఉపకరణాలు అందించారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ ఎల్.ఎన్.వి.శ్రీధర్, డీఈవో రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో గజరాజులు

కురుపాం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కురుపాం పంచాయతీ సీతంపేట, పూతికవలస పరిసర ప్రాంతాల్లో గల చెరుకు, అరటి, పామాయిల్ తోటలలో మంగళవారం ఏనుగుల గుంపు కనిపించింది. ఈ ఏడాది జనవరి నెలలో సీతంపేట, పూతికవలస పరిసర ప్రాంతాలలో సంచరించి వివిధ పంటలను నాశనం చేశాయి. దీనితో రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారు. ప్రస్తుతం మళ్లీ ఏనుగుల గుంపు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాలకు వెళ్లే రైతులు, పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు కోరుతున్నారు. ఆ ప్రాంత రహదారుల్లో ప్రయాణించే వాహన చోదకులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.



సీతంపేట పొలాల్లో సంచరిస్తున్న గజరాజులు

దరఖాస్తులను గడువులోగా పరిష్కరించండి

- జేసీ సేతుమాధవన్



మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం కలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపన కోసం అందిన దరఖాస్తులను సింగిల్ డెస్క్ పాలసీ క్రింద 21 రోజుల్లో పరిష్కరించాలని జేసీ సేతు మాధవన్ ఆదేశించారు. మే నుంచి జూలై వరకు 1652 దరఖాస్తులు అందగా.. వాటిలో 1634 దరఖాస్తులకు అనుమతి ఇచ్చామని తెలిపారు. 11 దరఖాస్తులు కాలుష్య నియంత్రణ మండలి వద్ద, మిగిలినవి ఫైర్, గ్రౌండ్ వాటర్ , ఫ్యాక్టరీస్, లీగల్ మెట్రాలజీ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వీటిని గడువులోగా పరిష్కరించాలని, తిరస్కరిస్తే తగిన కారణాలను తెలియజేయాలని స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల కమిటీ సమావేశం జేసీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 9 క్లైయిమ్స్ కోసం రూ.45 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. జిల్లాలో విశ్వకర్మ పథకం కింద 66,085 దరఖాస్తులు అందాయని తెలిపారు. 6,185 దరఖాస్తులను ఆమోదించామని చెప్పారు. నాబార్డు ద్వారా వ్యవసాయ క్లినిక్‌లు వ్యవసాయ, వ్యాపార కేంద్రాల పథకం కింద యువతకు ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ కరుణాకర్, నాబార్డు డీడీ నాగార్జున, ఎల్‌డీఎం రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ బీఆర్ అంబేద్కర్

● ఈవీఎం గోదాం తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న కలెక్టర్

నెల్లిమర్ల, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఈవీఎం గోదాంను కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ మంగళవారం తనిఖీచేశారు. బందోబస్తుపై సమీక్షించారు. సీసీ కెమెరాల ద్వారా గోదాంలోని చుట్టుపక్కల పరిస్థితులపై పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులను, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవో డి.కీర్తి, నెల్లిమర్ల తహసీల్దార్ శ్రీకాంత్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కరరావు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీ కార్యాలయంలో రక్తదాన శిబిరం

రాజాం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించినట్టు వ్యవసాయ శాఖ ఏడీఏ కె.చంద్రరావు తెలిపారు. ఈ శిబిరంలో ఏడీఏ, ఏవోలు, ఏఈవోలు కలిపి మొత్తం 21 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో చీకటి రఘునాథ్, జిల్లా రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.

పర్లలో కేంద్ర బృందం పర్యటన

చీపురుపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పర్ల గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం మంగళవారం పర్యటించింది. ఈ బృందంలోని సభ్యులు ఎల్.హారిక, టి.వినోద్ తదితరులు గ్రామంలోని పరిసరాలను పరిశీలించారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సందర్శించారు. ఆరోగ్య కేంద్రం, గ్రామ సచివాలయం, తదితర ప్రదేశాల్లో మరుగుదొడ్ల నిర్వహణ, తదితర అంశాలపై ఆరా తీశారు. వారి వెంట సర్పంచ్ మహంతి అప్పలనాయుడు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శృంగవరపుకోట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రి, బర్మా కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, రేగ పుణ్యగిరి, అయ్యప్ప లేఅవుట్, పుణ్యగిరి రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్‌ను నిలిపేస్తున్నామని చెప్పారు.

గురుకులంలో మిగులు సీట్ల భర్తీకి చర్యలు

రేగిడి, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంగరాడమెట్ట అంబేద్కర్ గురుకుల కళాశాలలో 5, 10, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో (ఇంగ్లీష్ మీడియం) ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ పి.రఘురాంనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 31లోగా కళాశాలను సంప్రదించి, సీట్లు పొందవచ్చని ఆయన చెప్పారు.

ఎస్‌డబ్ల్యూపీసీల పరిశీలన

సంతకవిటి, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిల్లాని, తలతంపర పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీలు)ను డిప్యూటీ ఎంపీడీవో ఎస్.శ్రవణ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట బిల్లాని, తలతంపర కార్యదర్శులు చిన్నారావు, కేశవరావు ఉన్నారు. ఆయన గ్రామాల్లో పర్యటించి.. పొడి చెత్త, తడి చెత్త వేర్వేరుగా అందించాలని ప్రజలకు సూచించారు. చెత్త నిర్వహణ, ఐవీఆర్ఎస్ కాల్స్‌పై అవగాహన కల్పించారు.

వసతిగృహం తనిఖీ

నెల్లిమర్ల, జూలై 29(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలుర ఆశ్రమ పాఠశాల వసతిగృహాన్ని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ మంగళవారం సందర్శించారు. వసతిగృహం గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. ఎప్పటికప్పుడు వాటిని శుభ్రంగా ఉండేటట్టు చూసుకోవాలని సూచించారు. మెనూపై ఆరా తీశారు. పాఠశాల ప్రిన్సిపాల్ కర్రి సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండు రోజులు గడువు ఇవ్వండి



ఆక్రమణల తొలగింపునకు వచ్చిన అధికారులు

శృంగవరపుకోట, జూలై 29(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని విశాఖ-అరకు రోడ్డులో ఆక్రమణల తొలగింపునకు అధికారులు సిద్ధపడ్డారు. మంగళవారం ఉదయం తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సతీష్, ఎన్‌హెచ్‌ఏ ఏఈఈ సురేష్, పంచాయతీ రాజ్ ఏఈ సత్యనారాయణ, పంచాయతీ ఈవో వీవీ అనురాధలు ఆక్రమణల తొలగింపునకు ప్రయత్నం చేశారు. ఇంతలో సీపీఐ నాయకుడు కామేశ్వరరావు ఆక్రమణల తొలగింపునకు రెండు రోజులు సమయం కావాలని అడిగారు. ప్రస్తుతానికి తాత్కాలికంగా ఆక్రమణల తొలగింపును నిలిపేశారు.

ఎటు చూసినా మురుగు, చెత్త

● అధ్వానంగా చేపలకంచేరు, బైరెడ్డిపాలెం గ్రామాలు

● కానరాని పారిశుధ్య నిర్వహణ



బోరు చుట్టూ నిల్వ ఉన్న మురుగు



చేపలకంచేరులో పేరుకుపోయిన చెత్త

భోగాపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపలకంచేరు, బైరెడ్డిపాలెం గ్రామాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. చేపలకంచేరు పంచాయతీలో మురుగు కాలువలు పూడికలతో నిండిపోయాయి. కొన్నిచోట్ల కాలువలు లేకపోవడంతో ఎక్కడికక్కడే మురుగు నిల్వ ఉండిపోతోంది. అధికారులు స్పందించి పారిశుధ్య పనులు నిర్వహించాలని మత్స్యకారులు కోరుతున్నారు. బైరెడ్డిపాలెంలో బోర్ల వద్ద నీరు కాలువల్లో ప్రవహించడం లేదు. సచివాలయానికి వెళ్లే రహదారికి ఇరువైపులా కాలువలు పూడికలతో దర్శనమిస్తు న్నాయి. రహదారి డంపింగ్ యార్డును తలపిస్తోంది.

● దీనిపై డిప్యూటీ ఎంపీడీవో గాయత్రిని వివరణ కోరగా.. సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లాలో మూడు ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు నిర్ణయం

● మంత్రి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. నగరంలోని మెసానిక్ టెంపుల్‌లో మంగళవా రం జరిగిన చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వ్యాపార సంస్థలు సరికొత్త ఆలోచనలతో ముందుకు వెళ్తున్నాయని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నదని తెలిపా రు. దీనిలో భాగంగా జిల్లాలో మూడు పార్కులు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతుందన్నారు. వ్యాపారసంస్థల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు కాపుగంటి శ్రీనివాస్, బొడ్డు శ్రీనివాస్‌రావు, కోశాధికారి ప్రవీణ్ అంచాలీయాతో పాటు తొమ్మిది మంది ఉపాధ్యక్షులు, తొమ్మిది సహాయ కార్యదర్శులు ప్రమాణ స్వీకారం చేశారు.

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన



కరపత్రాలను పంపిణీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ నాగార్జున

నెల్లిమర్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంతో కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. మంగళవారం కొండవెలగాడ గ్రామంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్‌తో కలిసి ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, అవనాపు సత్యనారాయణ, కాళ్ల రాజశేఖర్, దంతులూరి అజయ్‌బాబు, మొయిద సత్యనారాయణ, శ్రీనివాసరావు, మొయిద సీతంనాయుడు, చల్లా రాము పాల్గొన్నారు.

టీడీపీతోనే ప్రజలకు మేలు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

గుర్ల, జూలై 29(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే ప్రజలకు మేలు జరుగుతుందని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. తాడిపూడి, చిన్న నాగళ్లవలస గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అలాగే సీసీ రోడ్లను, గోశాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేటీఆర్, వి.సన్యాసినాయుడు, కిరణ్‌కుమార్, సీహెచ్.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోట అభివృద్ధికి శ్రీభరత్ కృషి



చీరలు పంపిణీ చేస్తున్న గొంప కృష్ణ

శృంగవరపుకోట, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట నియోజకవర్గ అభివృద్ధికి విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ కృషి చేస్తున్నారని డీసీఎంఎస్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో ఎంపీ ఎం.శ్రీభరత్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా 200 మందికి చీరలు, పంచెలు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. గొంప కృష్ణ తోపాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, నాయకులు జుత్తాడ రామసత్యం, గుమ్మడి భారతి, ఎం.మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయంలో పూజలు

విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ పుట్టిన రోజు సందర్భంగా ఎస్.కోటలోని దుర్గాదేవి ఆలయంలో టీడీపీ నాయకులు పూజలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు జీఎస్ నాయుడు, మాజీ మండల అధ్యక్షుడు రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, నాయకులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

సంతకవిటి, జూలై 29(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీలో అవినీతికి పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని తహసీల్దార్ సుదర్శనరావు, సీఎస్‌డీటీ చిరంజీవి హెచ్చరించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వారు మండలంలోని డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతినెల 1వ తేదీ నుంచి 15 తేదీ వరకు రేషన్ దుకాణాలు తెరిచి ఉండాలన్నారు. 65 ఏళ్ల పైబడిన వారికి ఇళ్ల వద్దకు వెళ్లి సరుకులు అందించాలని సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే ఆయా డిపోలను సందర్శిస్తామని, ఆ సమయంలో అందుబాటులో లేని డీలర్లపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

ఘనంగా శ్రావణ మంగళగౌరీ వ్రతాలు



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

సంతకవిటి, జూలై 29(ఆంధ్రజ్యోతి): మోదుగులపేట గ్రామంలోని కాశీవిశ్వేశ్వర ఆలయ ప్రాంగణంలో మంగళవారం శ్రావణ మంగళగౌరీ వ్రతాలు నిర్వహించారు. ఈ పూజల్లో అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

జిందాల్ కర్మాగారాన్ని తెరిపించండి

● మంత్రిని కోరిన కార్మికులు

కొత్తవలస, జూలై 29(ఆంధ్రజ్యోతి): అప్పన్నపాలెం పంచాయతీ జిందాల్ నగర్‌లో ఉన్న జేఎస్ఎల్ కర్మాగారంలో లాకౌట్‌ను ఎత్తివేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆ కర్మాగార కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు లెంక శ్రీనివాస్.. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కోరారు. మంగళవారం ఆయన కార్మికులతో కలిసి విజయనగరంలో ఉన్న మంత్రి వద్దకు వెళ్లారు. సమస్యను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే తాను కేంద్ర గనుల శాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డితో చర్చించానని మంత్రి చెప్పారు. కర్మాగారానికి 35 శాతం ముడిసరుకును సరఫరా చేసేందుకు అంగీకారం తెలిపారన్నారు. నూరు శాతం ముడిసరుకు సరఫరా చేయాలని కోరుతున్నామని, ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లామని చెప్పారు. లాకౌట్‌ను ఎత్తివేయడానికి తన వంతు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు రైతులకు అందుబాటులో ఉండాలి

● డీసీసీబీ చైర్మన్ నాగార్జున

గుర్ల, జూలై 29(ఆంధ్రజ్యోతి): రైతులకు, మహిళలకు ఇబ్బందులు లేకుండా బ్యాంకు సేవలు అందుబాటులో ఉండాలని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. కెల్ల జంక్షన్‌లో ఉన్న సహకార పరపతి బ్యాంకును ఆయన మంగళవారం తనిఖీ చేశారు. బ్యాంకు అధికారులతో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలోకి వెళ్లి రైతులు, మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. వారికి బ్యాంకు సేవలు అందుబాటులో తేవాలన్నారు. గ్రామస్థాయిలోకి వెళ్లి డిపాజిట్లు సేకరించాలని సూచించారు. కావాల్సిన వారికి రుణాలు కూడా మంజూరు చేయాలన్నారు. డ్వాక్రా సంఘాలకు సంబంధించి బ్యాంకు ఖాతాలను కోపరేటివ్ బ్యాంకులో తెరచి వ్యాపారాన్ని పెంచాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు చనమల మహేశ్వరరావు, బ్యాంకు మేనేజర్ పి.నివేదిత, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఆర్‌టీ, సరోగసీ క్లినిక్‌ల తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

విజయనగరం రింగురోడ్డు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఉన్న ఏఆర్‌టీ, సరోగసీ క్లినిక్స్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి జీవనరాణి మంగళవారం తనిఖీ చేశారు. వైజాగ్ ఐవీఎఫ్, క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆసుపత్రులను ఆమె సందర్శించారు. రికార్డు లు, రిపోర్టులు తనిఖీ చేశారు. కొన్ని లోపాలు చూసి వారికి పలు సూచనలు చేశారు. పీసీపీ ఎన్‌డీటీ, ఎంటీపీ చట్టానికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో డెమె వి.చిన్నతల్లి, డిప్యూటీ డెమో రవికుమార్, డిప్యూటీ హెల్త్ఎడ్యుకేషన్ అధికారి చాముండేశ్వరీ, సీసీ చంద్రశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ అనీల్‌ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

రీజియన్ హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

ఎస్.కోట రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): కిల్తంపాలెం జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం హైదరాబాద్ రీజియన్ హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను నవోదయ ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ ప్రారంభించారు. ఈ పోటీల్లో దక్షిణ భారతదేశంలోని ఎనిమిది క్లస్టర్లు యానాం, అదిలాబాద్, కన్నూర్, కరైకల్, ఎర్నాకులం, హావేరి, హాసన్, కలబుర్గి పరిధిలోని క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు జరుగనున్నాయి. విజేతలు బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారు. ఈ పోటీలకు హెచ్ఎఫ్ఐ కార్యదర్శి ఎస్.రాజారావు నేతృత్వం వహిస్తున్నారు.

రోడ్డునూ తవ్వేస్తున్నారు



ప్రధాన రహదారిని తవ్వి పైపులు వేసిన దృశ్యం

జామి, జూలై 29(ఆంధ్రజ్యోతి): రోడ్డును అడ్డదిడ్డంగా తవ్వేస్తున్నా సంబంధిత శాఖ ఎందుకు చోద్యం చూస్తుందో.. అని భీమసింగి గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. మంగళవారం ఆ గ్రామానికి చెందిన విజినిగిరి శంకరరావు మాట్లాడారు. స్థానిక వైసీపీ నాయకుడు ఒకరు భీమసింగి-కొత్తవలస రోడ్డును మధ్యలో నుంచి తవ్వి తన భవనాల నుంచి వచ్చే నీటిని చెరువులోకి మళ్లించేలా పైపులు వేశారని తెలిపారు. ఇది చట్ట విరుద్ధమని తెలిసినా ఏ అధికారి ఆపలేదన్నారు. ఈ విషయంపై కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

● దీనిపై రహదారుల శాఖ జేఈ ఉదయ్‌ను వివరణ కోరగా.. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. సంబంధిత వ్యక్తిపై శాఖాపరమైన చర్యలకు సిద్ధమవుతున్నామని తెలిపారు.

నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తాం

● ఎమ్మెల్యే నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

● కౌన్సిల్ సమావేశంలో సమస్యలపై ధ్వజమెత్తిన సభ్యులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి, పక్కన మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

నెల్లిమర్ల, జూలై 29(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశానికి వారు అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో విద్యుత్ దీపాలు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, లోఓల్టేజీ సమస్యలపై కౌన్సిల్ సభ్యులు ధ్వజమెత్తారు. నగర పంచాయతీలో తాగునీటి కొరత నెలకొందని, అసలు ఎన్ని ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేశారో లెక్కతేల్చి చెప్పాలని టీడీపీ నాయకుడు లెంక అప్పలనాయుడు డిమాండ్ చేశారు. దీంతో వాటర్ ట్యాంకుల నిర్వహణకు రూ.53వేల ఖర్చుకు సంబంధించి ఎజెండా అంశాన్ని తొలగించారు. వీధి దీపాల ఏర్పాటు నిర్వహణకు రూ.4లక్షల 98వేలు ఖర్చు ప్రతిపాదన పెడుతున్నట్టు అధికారులు చెబుతుండగా.. అసలు వీధిలైట్లు వెలగడం లేదని, లో ఓల్టేజీతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని, తిరిగి కొత్త ప్రతిపాదనలు ఎలా చేస్తారని 16వ వార్డు జనసేన నాయకుడు పొంద్రంకి సత్యనారాయణ ప్రశ్నించారు. ఇలా వివిధ సమస్యలపై సభ్యులు ధ్వజమెత్తారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ సభ్యులు తెలిపిన సమస్యలపై దృష్టి సారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇంటింటి కుళాయి పథకానికి డిపాజిట్ చెల్లించకుండా తాగునీటిని వాడుకుంటున్న యజమానులు రూ.11వేల డిపాజిట్‌ను మూడు వాయిదాలలో చెల్లించేందుకు ఆమోదిస్తూ తీర్మానించారు. ఈ సమావేశంలో కమిషనర్ టి.జయరాం, వైస్ చైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బొగ్గు వ్యాగన్‌లో చెలరేగిన మంటలు

గజపతినగరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్‌లోని బొగ్గు వ్యాగన్‌లో మంగళవారం మంటలు చెలరేగాయి. అగ్నిమాపక కేంద్ర అధికారి రవిప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయిపూర్ నుంచి విశాఖపట్నం వైపు బొగ్గులోడుతో వెళ్తున్న గూడ్స్‌లో మంటలు చెలరేగాయి. దీంతో ఆ గూడ్స్ గజపతినగరం రైల్వేస్టేషన్‌లో నిలిచింది. బొగ్గు వ్యాగన్ నుంచి మంటలు వ్యాపించడంతో స్టేషన్ మాస్టర్ రామకృష్ణారావు అగ్నిమాపక కేంద్ర అధికారికి సమాచారం అందజేశారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి, మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సుమారు రూ.10వేలు ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చునని అగ్నిమాపక కేంద్ర అధికారి ప్రాథమికంగా అంచనా వేశారు.

గంజాయి స్వాధీనం

ఎస్.కోట రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవర చెక్‌పోస్టు వద్ద సోమవారం అర్ధరాత్రి విశాఖ మన్యం నుంచి కేరళకు వెళ్తున్న వ్యానులో తరలిస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు ముందుగా వచ్చిన సమాచారం మేరకు చెక్‌పోస్టు వద్ద మాటువేశారు. ఆ సమయంలో వచ్చిన ఓ వ్యానును ఆపి, తనిఖీ చేశారు. ఇందులో పెద్ద మొత్తంలో గంజాయిని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

భోగాపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): తన భార్య, కుమారుడు అదృశ్యమైనట్టు భోగాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ దుర్గాప్రసాద్‌రావు మంగళవారం తెలిపారు. ఫిర్యాదుదారుడికి వివాహమై రెండేళ్ల అయ్యింది. ఏడాది బాబు కూడా ఉన్నాడు. అయితే ఈనెల 28వ తేదీ రాత్రి నుంచి తన భార్య, బాబు కనిపించలేదని, ఆచూకీ కోసం చుట్టుపక్కల గాలించినా లభ్యం కాలేదని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

జేఎన్‌టీయూ విద్యార్థుల నిరసన

విజయనగరం రూరల్, జూలై29(ఆంధ్రజ్యోతి): నగర శివారులో ఉన్న జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో మంగళవారం రాత్రి వసతిగృహాల్లో ఉన్న సీనియర్ విద్యార్థులు నిరసన చేపట్టారు. ఒక వసతిగృహం గదికి ఐదుగురికి మించి ఉండకూడదన్న నిబంధన ఉంది. అయితే కొంతమంది సీనియర్ విద్యార్థులు ఐదుగురి కంటే ఎక్కువమంది ఉండడంతో వసతిగృహం పర్యవేక్షణ అధికారులు దీనిపై ప్రశ్నించారు. దీంతో విద్యార్థులకు, అధికారులకు మధ్య వివాదం తలెత్తింది. ఈనేపథ్యంలో విద్యార్థులు నిరసన చేపట్టారు.

హోంగార్డుల సంక్షేమానికి చర్యలు

● ఎస్పీ వకుల్ జిందాల్



ఎస్పీకి మొక్కను అందజేస్తున్న విశాఖ రీజియన్ హోంగార్డు కమాండెంట్ జోషి

విజయనగరం క్రైం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డుల సంక్షేమానికి ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు చేపడతామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. విశాఖపట్టణం రీజియన్ హోంగార్డు కమాండెంట్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎ.జ్యోషి తొలిసారిగా జిల్లాకు విచ్చేసి ఎస్పీని కలిసి, మొక్కను అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులకు ప్రభుత్వ పథకాలు, బస్ పాస్‌లు, హెల్త్ పాలసీ వంటి అంశాలను ఉన్నతాధికా రుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు చేపడతామన్నారు. జ్యోషి మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న హోంగార్డులతో సమావేశమై వారు ఎదుర్కొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నామని చెప్పారు. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమేష్ కుమార్, ఆర్ఎస్ఐ ముబారక్ ఆలీ, హెచ్‌సీలు రాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కరాటేతో మహిళలకు స్వీయరక్షణ

విజయనగరం క్రైం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థినులపై జరిగే దాడులు, లైంగిక దాడులను ప్రతిఘటించి వాటిని తిప్పికొట్టేందుకు స్వీయ రక్షణ కోసం కరాటేకి ప్రాధాన్యత ఇస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శార్వాణి పోలీసు వెల్ఫేర్ పాఠశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు స్వీయ రక్షణ, మెలకువలు నేర్పించేందుకు ప్రత్యేకంగా ఒక మహిళా శిక్షకురాలిని నియమిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐ లీలారావు, ఆర్ఐ గోపాలనాయుడు, హెచ్ఎం సంధ్య, ఆర్ఎస్ఐలు ప్రసాదరావు, రామకృష్ణ, శిక్షకురాలు రాధ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సామగ్రి పంపిణీ

రాజాం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో అగ్నిప్రమాదంలో ఇళ్లు కూలిపోయిన బత్తిన సీతారాం, బత్తిన సరోజినిలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర సామగ్రి అందజేశారు. బాధితులకు ఒక కిచెన్ కిట్, 2 దుప్పట్లు అందజేశారు. రెవెన్యూ అధికారులు, రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, జేఆర్సీ కన్వీనరు పి.వేణుగోపాలరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

లక్కవరపుకోటలో యూరియా కొరత

లక్కవరపుకోట, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులను యూరియా కొరత వేధిస్తోంది. 240 మెట్రిక్ టన్నుల యూరియా డిమాండ్ పెట్టగా 132 టన్నులు మాత్రమే వచ్చింది. వచ్చిన యూరియా వచ్చినట్లే అయిపోయింది. ముమ్మరంగా దమ్ములు చేస్తున్న రైతులు యూరియా దొరక్కపోవడంతో ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కాంప్లెక్స్ ఎరువులు, డీఏపీ, సూపర్‌ఫాస్ఫేట్, పొటాష్ ఎరువులు అసలు సరఫరా లేదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. దీంతో రైతులు తీవ్ర నిరాశకు గురై బ్లాక్ మార్కెట్‌ను ఆశ్రయిస్తున్నారు. ఎరువుల నిల్వలపై వ్యవసాయాధికారి హరికృష్ణను వివరణ కోరగా.. రెండు రోజుల్లో వస్తాయని తెలిపారు.

రైతు సేవా కేంద్రాలకు యూరియా

మెరకముడిదాం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్నామని ఏవో శ్రావణ్‌తేజ తెలిపారు. ఆమె మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఊటపల్లి, గర్భాం, చెల్లాపురం, గరుగుబిల్లి, సాతాంవలస రైతు సేవా కేంద్రాలకు 12 టన్నుల చొప్పున యూరియా వచ్చిందని చెప్పారు. రైతులు అధైర్య పడవద్దన్నారు.

పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వండి

బొండపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పారిశుధ్య పనులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి పి.మల్లికార్జునరావు అన్నారు. బోడసింగిపేట గ్రామాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రమేష్, ఈవోపీఆర్‌డీ ఎ.రఘుపతిరావు ఉన్నారు. ప్రతి రోజూ ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి చెత్తసంపద కేంద్రాలకు తరలించాలని కార్యదర్శులకు సూచించారు. అలాగే 15 రోజులకు ఒకసారి తాగునీటి ట్యాంకులు, నేలబావులు, బోరుబావుల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. సర్పంచ్ మీసాల జానకిరావు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల నియామకం

కొత్తవలస, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాజీకి వీలుపడే కేసులలో మధ్యవర్తిత్వం ద్వారా ఇరుపార్టీలకు నచ్చజెప్పి కేసులను రాజీ చేసేందుకు న్యాయ సేవాధికార సంస్థ కొత్తవలస కోర్టుకు చెందిన ఇద్దరు న్యాయవాదులను నియమించింది. ఏపీ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో వివిధ కోర్టులలో న్యాయవాదులుగా ప్రాక్టీసు చేస్తున్న 29 మంది న్యాయవాదులకు జిల్లా కోర్టులో 40 గంటల పాటు శిక్షణా తరగతులను నిర్వహించారు. దీనిలో కొత్తవలస కోర్టు నుంచి డి.శ్రీనివాస్, నందిపల్లి శ్రీరామమూర్తి శిక్షణ పొందారు.

ఆకట్టుకున్న కోలాటం



కోలాటం ఆడుతున్న మహిళలు

విజయనగరం కల్చరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ అమ్మవారి చదురుగుడి ఆధ్యాత్మిక కళావేదిక వద్ద మంగళవారం నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. దాసన్నపేట కాళీమాత బృందం, పిల్లలు ఈ కోలాటంలో పాల్గొన్నారు. దేవదాయ శాఖ ఏసీ శిరీషా పర్యవేక్షణలో పైడిమాంబ ఆధ్యాత్మిక సేవా సంఘం నిర్వాహకులు ఆర్.సూర్యపాత్రో ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఖాళీగా ఉందా.. కబ్జానే!

(5వ పేజీ తరువాయి)

అందడం లేదు. ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేసే సమయంలో సాగునీరు ప్రధాన రహదారులపైకి, పలు కాలనీల్లోకి చేరుతుంది.

● పట్టణం గుండా చిన్నకాపువీధి, పెదకాపువీధి, గేదెలవారివీధి, గెటాల డెప్పివీధి మీదుగా అన్నవరం వైపు వెళ్లే పోతులగెడ్డ కూడా ఆక్రమణలకు గురికావడంతో సాగునీరు సక్రమంగా సాగడం లేదు. గారమ్మకాలనీ, అన్నవరం కూడళ్ల వద్ద గెడ్డలోనే అక్రమ నిర్మాణాలు చేపట్టారు.

● ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని వరదకాలువపై ఇరువైపులా అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో వరదనీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది.

కఠిన చర్యలు తీసుకుంటాం..

ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పట్టణంలో ఆక్రమణలను గుర్తించి తొలగించే కార్యక్రమం చేపడం. ప్రభుత్వ స్థలాల రక్షణకు ప్రత్యే చర్యలు తీసుకుంటాం.

- సీహెచ్ రాధాకృష్ణమూర్తి, తహసీల్దార్, పాలకొండ

ఏటా ఆలస్యమే..!

(5వ పేజీ తరువాయి)

ఇంకొంతమంది గిరిజన విద్యార్థులు ఇంటర్ విద్యకు దూరమవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గురుకుల కళాశాలల్లో సీట్లకు ఉన్న డిమాండ్ మేరకు ప్రవేశాలు కల్పించాలని గిరిజన సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గిరిజన విద్యార్థుల కోసం ఈ ఏడాది ఇంటర్మీడియట్‌లో అదనంగా 30సీట్లు పెంచామని గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర చెప్పారు. కళాశాలల్లో ప్రవేశాలకు నేటి వరకు సమయం ఉన్నందున పెంచిన సీట్లన్నీ భర్తీ అవుతాయని తెలిపారు.

ఆ 46 ఇళ్లకు రీసర్వే

(5వ పేజీ తరువాయి)

ఎక్కువగా చూపి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీంతో ఆయా ఇళ్ల పన్నులు భారీ మొత్తంలో వస్తుండడంతో పంచాయతీ కార్యదర్శులు పీఆర్ కమిషనర్‌కు లేఖలు రాశారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రస్తుతం రీ సర్వే చేస్తున్నారు. ఈ నివేదికలను పైఅధికారులకు పంపించనున్నారు. అయితే ఆన్‌లైన్‌లో ఆయా ఇళ్ల విస్తీర్ణాలను సవరించడం అంత తేలికైన పనికాదనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కాగా ఈ రీసర్వేలో పాలకొండ డీఎల్‌పీవో జె.రాంప్రసాద్‌రావు, డిప్యూటీ ఎంపీడీవో ఏ.జగన్నాథరావు, పంచాయతీ కార్యదర్శి కె.బాలాకుమారి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో నడిపించాలి

సీతంపేట రూరల్: గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని డీపీవో కొండలరావు అన్నారు. మంగళవారం సీతంపేట పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఇంటి పన్ను, ప్యూరిఫికేషన్, చెత్త సేకరణ వంటి అంశాలపై పంచాయతీ పరిపాలనపై అధికారులతో సమీక్షించారు. ఇంటిపన్ను మదింపు ప్రక్రియపై తగు సూచనలిచ్చారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యం, కార్యదర్శి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ ఇల్లు

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేక డ్రైవ్ చేపట్టి త్వరితగతిన పరిష్కరించాలి. జిల్లాలో చేపడుతున్న భూముల రీసర్వే డిసెంబరు-27 నాటికి పూర్తి కావాలి.' అని తెలిపారు.

రీసర్వేతోనే సమస్యలు పరిష్కారం

సీతానగరం: రీసర్వేతోనే భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఏడీ గోవిందరావు తెలిపారు. లచ్చయ్యపేటలో నిర్వహించిన గ్రామసభలో రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

గర్భిణులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కొమరాడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గర్భిణులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ కె.వి.ఎస్.పద్మావతి అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెదకేర్జిల గిరిజన ఆశ్రమం స్కూల్‌ను ఆమె సందర్శించారు. పీహెచ్‌సీలో ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. మలేరియా జ్వరాల వ్యాప్తి కోసం అడిగి తెలుసుకున్నారు. చినకేర్జిల గ్రామంలో జరుగుతున్న ఐఆర్ఎస్ స్ప్రేయింగ్‌ను జిల్లా మలేరియా అధికారి, స్థానిక వైద్యాధికారితో పాటు కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

మామిడిపల్లిలో ఖేల్‌కూద్ పోటీలు

సాలూరు రూరల్, జూలై29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లా సరస్వతి శిశుమందిరాల విభాగ్ స్థాయి ఖేల్‌కూద్ పోటీలు మంగళవారం మామిడిపల్లిలో నిర్వహించారు. నెల్లిమర్ల, బొబ్బిలి, మామిడిపల్లి, సాలూరు తదితర ప్రాంతాల విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, పరుగు పందెం, లాంగ్‌జంప్, హై జంప్ పోటీలను నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానం మామిడిపల్లి, ద్వితీయ స్థానం నెల్లిమర్ల కైవసం చేసుకున్నాయి.

నేడు బొడ్డవలస గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

సాలూరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బొడ్డవలస బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మిగులు సీట్లుకు ఈ నెల 30న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వీవీఎస్ మూర్తి చెప్పారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఐదో తరగతిలో 53 సీట్లు, ఆరో తరగతిలో 13 సీట్లు, ఏడో తరగతిలో 21 సీట్లు, ఎనిమిదో తరగతిలో పది, తొమ్మిదో తరగతిలో పది సీట్లు, పదో తరగతిలో 15 సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ ఏడాదిలో 42, ద్వితీయ ఏడాదిలో 31 సీట్లు ఉన్నాయన్నారు. వీటి భర్తీ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులతో చేయనున్నామన్నారు. సీట్లు కావాల్సిన విద్యార్థులు విద్యార్హత, కులం, ఆధార్ తదితర వాటితో పాఠశాలకు హాజరుకావాలని కోరారు.

గతేడాదికి మించి కళాశాలలో ప్రవేశాలు

భామిని, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర కళాశాలలో గత ఏడాదికి మించి ఈ ఏడాది 14 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారని ప్రిన్సిపాల్ ఎస్.వి.ఎల్.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని పత్రికల్లో అన్ని గ్రూప్‌లు ఖాళీగా ఉన్నాయని ప్రకటించడం అవాస్తవమన్నారు. ఈనెల 31 వరకు ప్రవేశాలు ఉండడంతో పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది నుంచి ఐఐటి, జేఈఈ, నీట్ పరీక్షలకు విద్యార్థులకు అవసరమైన శిక్షణ అందించనున్నామన్నారు.

పండుగ ఖర్చులకు ఆమోదం తెలపరా?

● మున్సిపల్ పాలకవర్గం తీరుపై రాష్ట్ర మంత్రి సంధ్యారాణి ఫైర్



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు, జూలై29 (ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామదేవత శ్యామలాంబ పండుగ కోసం రూ.2 కోట్ల నిధులు తెస్తే ఆ నిధుల ఖర్చుకు మున్సిపల్ పాలకవర్గం ఆమోదం తెలపకపోవడంపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే మున్సిపల్ సాధారణ నిధుల నుంచి వీధి కుక్కల సంతాన నియంత్రణ ఖర్చుల బిల్లుల చెల్లింపునకు ఆమోదం తెలపడం విడ్డూరమేనన్నారు. పట్టణంలో ఈ ఏడాది మే 18, 19, 20 తేదీల్లో నిర్వహించిన శ్యామలాంబ అమ్మవారి పండుగకు సంబంధించి దాతలు ఇచ్చిన విరాళాలు, ఖర్చులకు సంబంధించి శ్యామలాంబ అమ్మవారి ఆలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథి రాష్ట్రమంత్రి సంధ్యారాణి హాజరయ్యారు. ముందుగా ఆమె ముందుగా శ్యామలాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్యామలాంబ అమ్మవారి పండుగ గతంలో జరగని రీతిలో 45 ఏళ్ల తర్వాత ఎంతో ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పూర్తిస్థాయిలో సహకరించిన అధికారులకు, పట్టణ ప్రజలకు, ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు పండగకు సహకరించిన మెంటాడ వీధి, డబ్బి వీధి, అక్కేన వీధి, యాద వీధి ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. శ్యామలాంబ అమ్మవారి పండగకు 630 మంది దాతలు రూ.69 లక్షల 20 వేల 247లు అందించారన్నారు. అందులో అమ్మవారి పండగ నిమిత్తం రూ.56 లక్షల 49 వేల 849 ఖర్చు చేశామన్నారు. ఇంకా ఖాతాలో రూ.18 లక్షల 83వేల 398లు మిగిలి ఉన్నందుకు ఉత్సవ కమిటీని అభినందించారు. అమ్మవారి పండుగకు మున్సిపల్ పాలకవర్గం తప్ప ప్రతీ ఒక్కరూ సహకరించారని గుర్తుచేశారు. సాలూరు మున్సిపాలిటీలో సుమారు నాలుగున్నరేళ్లుగా పాలకవర్గం ఎన్నో తప్పుడు విధానాలు అవలంబిస్తోందన్నారు. దీంతో మున్సిపాలిటీలో అభివృద్ధి కుంటిపడిందన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్కేన అప్పారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కేతిరెడ్డి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి

సాలూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): కూటమితోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మంగళవారం పట్టణంలోని 12, 13, 16, 17 వార్డుల్లో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నిమ్మాది తిరుపతిరావు, అక్కేన అప్పారావు, గాడి కోటి, నూతి రాజేశ్వరి, అక్కేన రాధ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా



ప్రజలకు అభివాదం తెలుపుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని పెదబండపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ సంక్షేమ పథకాల కరపత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భాస్కరరావుకు పరామర్శ

బాలగుడబ గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముచ్చల భాస్కరరావును ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మంగళవారం పరామర్శించారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో భాస్కరరావుకు కాలికి గాయమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. బాలగుడబ వెళ్లి ఆయన బాగోగులు తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నాట్లు వేసిన ఎమ్మెల్యే ..

బాలగుడబలో మంగళవారం ఖరీఫ్ వరి ఉబాలను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పరిశీలించారు. రైతులతో, మహిళలతో కలిసి ఆయన వరి నాట్లు వేశారు. ఎమ్మెల్యే రైతులతో కలిసి నాట్లు వేయడంతో నాయకులు, కార్యకర్తలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థినులకు సైకిళ్లు

సీతానగరం, జూలై29 (ఆంధ్రజ్యోతి): మరిపివలస జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తల్లిదండ్రులకు దూరమైన విద్యార్థినులకు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సైకిళ్లను అందజేశారు. ప్రపంచ వసుధైగ ఫౌండేషన్ యూనివర్సల్ సహకారంతో మంగళవారం నలుగురు విద్యార్థినులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను విద్యాశాఖ మంత్రి లోకేశ్ ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు సూరిదేముడు, వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, తవిటినాయుడు, ఉపాధ్యాయులు, స్కూల్ ఛైర్మన్ ఈశ్వరమ్మ, ఎం.సత్యనారాయణ, నాయకులు సత్యంనాయుడు, వేణుగోపాల్‌నాయుడు, కె.అరవింద్‌కుమార్, టి.శేఖర్, పి.నాగభూషణం, వి.సూర్యనారాయణ, బి.చిరంజీవి పాల్గొన్నారు.

ఆటో కార్మికుల పొట్ట కొట్టొద్దు



ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

పార్వతీపురం టౌన్, జూలై29 (ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు పేరిట ఆటో కార్మికుల పొట్ట కొట్టవద్దని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, గొర్లి వెంకటరమణ అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు పాత బస్టాండ్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నందున లక్షలాది మంది ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతారన్నారు. దాంతో ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలన్నారు. మన్యం జిల్లాలో సుమారు 5 వేల మంది కార్మికులు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఉచిత బస్సు పథకం వల్ల సుమారు 15 వేల మంది ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.సూరిబాబు, సంచాన ఉమామహేశ్వరరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నాగభూషణ్, సింహాచలం, కార్తీక్, అప్పలనాయుడు, ఎస్.చిన్న, నరసింహ, నారాయణ, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చించారు.

●పార్వతీపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర సర్వే భూ నమోదు విభాగ అదనపు సంచాలకుడు ఆర్.గోవిందరావు.. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో సర్వే తదితర అంశాలను కలెక్టర్‌తో చర్చించారు. అలాగే, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను పదోన్నతిపై ఇక్కడ వచ్చిన జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ విజయమోహన్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న సంధ్యారాణి

పాలకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బిడ్డిక సంధ్యారాణి మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఎప్పటికప్పుడు రైతులకు అవసరమైన సంక్షేమాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, జాడ శ్రీధర్, ఉదయాన ఉదయ్‌భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, వెన్నపు శ్రీనివాసరావు, ఆకుల కుమార్, అప్పలనాయుడు, ఏఎంసీ సెక్రటరీ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైస్ చైర్మన్, పలువురు డైరెక్టర్లు గైర్హాజరు..

ఏఎంసీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాల్సిన ముంజేటి త్రినాథరావుతో పాటు మరో ఏడుగురు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానం అందలేదని టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవి పేర్కొన్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులకు తెలికయజేశామన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీల క్లినిక్‌ల తనిఖీలు



తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

కురుపాం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎంపీ, పీఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లను అధికారుల బృందం మంగళవారం తనిఖీ చేసింది. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాల మేరకు మొండెంఖల్ వైద్యాధికారి డాక్టర్ ప్రజ్ఞ, డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌కుమార్, కురుపాం ఎస్ఐ నారాయణరావు, నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠరావు బృందం కురుపాంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారి లైసెన్సులు, రికార్డులు, మందులు పరిశీలించారు. రోగులకు స్థాయికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్యాంటీన్ నిర్వహణకు బహిరంగ వేలం

పార్వతీపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఐటీడీఏ క్యాంటీన్ నిర్వహణకు ఆగస్టు 1న బహిరంగ వేలం నిర్వహించ నున్నామని ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంటీన్‌ను గిరిజన అభ్య ర్థులకు కేటాయించామన్నారు. క్యాంటీన్ నిర్వహణకు ముందుగా రూ.30వేలను ప్రాజెక్టు అధికారి, ఐటీడీఏ, పార్వతీపురం పేరున జమ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతినెలా రూ.2 వేలు అద్దె చెల్లించాలన్నారు. ఆసక్తిగల గిరిజన అభ్యర్థులు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చన్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థికి పాముకాటు

సాలూరు రూరల్, జూలై29 (ఆంధ్రజ్యోతి): తోణాం ఆశ్రమ పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి కొర్ర సునీల్‌కు మంగళవారం పాము కాటు వేసింది. దాంతో చికిత్స నిమిత్తం విద్యార్థిని విజయ నగరం తరలించారు. ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి వసతిగృహంలో కాకుండా సమీపంలో ఉన్న గోముఖీ నది వద్దకు వెళ్లాడు. అక్కడ బాలుడిని పాము కాటు వేసింది. వెంటనే విద్యా ర్థిని వార్డెన్, ఏఎన్ఎం తదితరులు తోణాం పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం సాలూరు ఏరియా ఆసుపత్రికి అక్కడ నుంచి విజయనగరం మహారాజా జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. మహారాజా జిల్లా కేంద్రాసుపత్రిని నుంచి ఘోషాసుపత్రికి తరలించారు. విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వార్డెన్ లచ్చయ్య చెప్పారు.

క్రీడల్లోనూ రాణించండి

సాలూరు, జూలై29 (ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మంగళవారం సాలూరు గ్రామదేవత శ్యామలాంబ పండుగను పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన పాచిపెంట, ద్వితీయ స్థానంలో నిలిచిన సాలూరు క్రికెట్ జట్లను ఆమె అభినందించారు. అలాగే క్రీడలకు ఆర్థిక సాయాన్ని అందించిన 19వ వార్డు కౌన్సిలర్ హర్షవర్ధన్, బండాపు సతీష్‌లను ప్రశంసించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు రాజా తదితరులు పాల్గొన్నారు.

15న గిరిజన రైతులకు పట్టాలు

సాలూరు, జూలై29 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 15న గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు పంపిణీ చేస్తామని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో 10 గిరిజన గ్రామాల రైతులు ఆమెను మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా గిరిజనులతో ఆమె మాట్లా డుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సాగు భూములకు పట్టా లు అందజేస్తామన్నారు. గిరిజనుల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాల ను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పెదపదం టీడీపీ నాయకులు మ త్స శ్యామ్, మరిపి సింహాచలం, వెంకటి, మండల పార్టీ అధ్యక్షులు ఆముదాల పరమేశు పాల్గొన్నారు.

శివారు భూములకూ సాగునీరిస్తాం

పార్వతీపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వెంగళరాయసాగర్ ప్రాజెక్టు పరిధిలోని శివారు భూములకూ సాగునీటిని అందిస్తామని వీఆర్ఎస్ హెచ్ డబ్ల్యూ సబ్ డివిజన్ డీఈఈ డి.సురేష్ అన్నారు. ఈనెల 24న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. వెంగళరాయసాగర్ ప్రాజెక్టు పరిధిలో 19 పనులకు గానూ రాష్ట్ర విపత్తుల ఉపశమన నిధులు రూ.73.9 లక్షలు మంజూరయ్యాయన్నారు. వాటితో కుడి, ఎడమ ప్రధాన కాలువ, ఉప కాలువల్లోని పిచ్చిమొక్కలను తొలగించడం, పూడికలు తీయిస్తామన్నారు. అలాగే, వెంగళరాయసాగర్ జలాశయం ఆధునికీకరణకు నాలుగేళ్ల కింద మంజూరైన రూ.63.50 కోట్ల జైకా నిధులతో 22 శాతం వరకు పనులు పూర్తయ్యాయన్నారు. కుడ, ఎడమ కాలువల్లో ఆరు కిలోమీటర్లు లైనింగ్, హెడ్‌వర్క్స్ పనులు జరిగాయన్నారు. ఈ పనులకు రూ.10 కోట్ల వరకు గుత్తేదారుకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ పనులకు బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరిగిందన్నారు. బిల్లు మంజూరైన తర్వాత జైకా ఆధునికీకరణ పనులు పునః ప్రారంభిస్తామని డీఈఈ తెలిపారు.

భక్తుల సేవలో శ్రీవారి సేవకులు

గరుగుబిల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వెంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి దేవస్థానాలలో శ్రీవారి సేవకులు భక్తులకు సేవలందించేందుకు ముందుకు వస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లే భక్తులు తిరునామాలతో స్వామివారిని దర్శించుకుంటున్నారు. తోటపల్లిలో గతంలో తిరునామాలు ప్రక్రియ ఉండేది కాదు. ప్రస్తుతం దేవస్థానం పునర్నిర్మాణం కావడంతో అధికంగా భక్తులు తరలివస్తున్నారు. దేవస్థానంలో సిబ్బంది సమస్య నెలకొనడంతో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఆలయ అభివృద్ధి సేవాట్రస్ట్ శ్రీవారి సేవకులను భక్తులకు అందుబాటులో ఉంచుతున్నారు. మంగళవారం స్వామివారి దర్శనానికై వచ్చిన వారికి తిరునామాలు అలంకరణ చేయడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

సాలూరు, జూలై29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను పాఠశాలలకు తీసుకువెళుతున్న ఆటో డ్రైవర్లు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సాలూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ సూచించారు. పట్టణంలో మంగళవారం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు.

పంటల బీమా చేయించుకోండి

బెలగాం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో వివిధ పంటలకు రైతులు బీమా చేయించుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వివరాలను వెల్లడించారు. వరి పంట ఎకరానికి రూ.800 ప్రీమియం చెల్లిస్తే రూ.40 వేలు బీమా వర్తిస్తుందన్నారు. ఇందుకు ఆగస్టు 15లోగా బీమా చెల్లించాలన్నారు. మొక్కజొన్న పంట ఎకరానికి రూ.330 ప్రీమియం చెల్లిస్తే రూ.33 వేలు బీమా వర్తిస్తుందని, దీనికి జూలై 31 లోగా బీమా చేసుకోవాలని కలెక్టర్ వివరించారు.

మామిడిపల్లిలో ఇంటింటా వైద్యసేవలు

సాలూరు రూరల్, జూలై29 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లిలో బక్కుపేట, బెవర వీధుల్లో మంగళవారం నియోజకవర్గ వైద్య ప్రోగ్రామింగ్ అధికారి డి.శివకుమార్ ఆధ్వర్యంలో ఇంటింటా వైద్యసేవలందించారు. పలువురు చికెన్‌గన్యా లక్షణాలతో బాధపడుతున్నారనే సమాచారం మేరకు మామిడిపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బందిని తీసుకెళ్లి వైద్యతనిఖీలు నిర్వహించారు. ఆరుగురికి జ్వరాలు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఎవరికీ చికున్‌గన్యా జ్వరాలు లేవని తేల్చారు. జ్వరం, ఇతర వ్యాధులు సోకితే తక్షణమే వైద్య సిబ్బందికి సమాచారమందించాలని సిబ్బంది కోరారు.

డిగ్రీ ప్రవేశాలను ప్రారంభించండి



పాలకొండ: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

పాలకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ ప్రవేశాలను ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. అలాగే పార్వతీపురం, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో పీజీ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి టి.అఖిల్ మాట్లాడుతూ ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు రిజల్ట్ వచ్చి నాలుగు నెలలు అవుతున్నా ఇప్పటివరకు డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించకపోవడం అన్యాయమన్నారు. విద్యారంగ సమస్యలపై ఆగస్టు 1 నుంచి 4 వరకు కలెక్టరేట్ వద్ద దీక్షలు, 5న చలో కలెక్టరేట్ చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రాజేష్, అభి, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

●గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, డిగ్రీలో ప్రవేశాలు ప్రారంభిచాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాస్తారోకో చేపట్టారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి బిడ్డిక అనీల్, ఆరిక గంగారావు, జిల్లా కోశాధికారి కె.డేవిడ్, మండల కమిటీ సభ్యులు శివ, లవడు, సాయి, జగన్ పాల్గొన్నారు.

●సాలూరు: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హెచ్.సింహాచలం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. డిగ్రీలో మేజర్ మైనర్ ఆన్సర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు.కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి.శరత్‌కుమార్, ఎస్.ధర్మేంద్ర, పి.అయోబ్, జి.సురేష్, సంజీవ్, టి.ఎలిషా పాల్గొన్నారు.